## క్లుప్తంగా

### అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించొద్దు

జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్



ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై జరిగే అసాంఘిక కార్యకలాపాలను ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సీఐను ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పోలీస్ స్టేషనును గురువారం సాయంత్రం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్రలతో మాట్లాడారు. స్టేషను పరిసరాలను పరిశీలించారు. కేసుల వివరాలు, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వారధి కార్యక్రమం ద్వారా ప్రజలకు సమాజంలో జరుగుతున్న నేరాలు, మోసాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా హైవేపై జరిగే వ్యభిచారాన్ని పూర్తిగా కట్టడి చేయాలని సీఐ, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా స్థలం ఉంటే స్టేషను నిర్మాణానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

### చేబ్రోలు ఎంపీడీఓ కె.లలిత బాధ్యతల స్వీకారం



చేబ్రోలు: చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.లలిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లాలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న లలితను చేబ్రోలుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆమె గురువారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. లలితను ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సూపరింటెండెంటు ఉమాదేవి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందనలు తెలిపారు.

### అంకితభావంతో విధులు నిర్వహించాలి



ప్రత్తిపాడు: పనిచేసేచోట అంకిత భావంతో విధులను నిర్వర్తిస్తే ప్రజల మన్ననలు పొందవచ్చని ఎంపీడీఓ కె.శివపార్వతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న కార్యాలయం సూపరింటెండెంట్ డి.రామకోటయ్య జిల్లా పరిషత్‌కు, సీనియర్ అసిస్టెంట్ ఝాన్సీ పక్క మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి స్థానిక కార్యాలయంలో వీరికి వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ, చెంచురామయ్య, ఎంపీడీఓ శివపార్వతి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజాలతో పాటు పంచాయతీ కార్యదర్శులు దుశ్శాలువా పూలమాలలతో రామకోటయ్యను ఘనంగా సత్కరించారు. అనేక సంవత్సరాలుగా నిర్వివాదంగా ఇక్కడ సేవలు అందించిన రాయకోటయ్యను కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రేపు యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ



చేబ్రోలు: యూటీఎఫ్ చేబ్రోలు మండల స్వర్ణోత్సవ మహాసభ ఈ నెల 28వ తేదీన జరుగుతుందని ఉపాధ్యాయ సంఘ నాయకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఆహ్వాన పత్రికలను నాయకులు ఆవిష్కరించారు. గత ఏడాది కాలంలో పని విధానాన్ని సమీక్షించుకొని నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీచింగ్ ఎక్సలెన్సీ అవార్డ్స్ -2024 పేరుతో ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించటానికి కృషి చేసిన 18మంది ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను సత్కరించటం జరుగుతుందని వారు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొంటారని జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.రమేష్‌బాబు, డి.నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 29న మోడల్ టెట్

గుంటూరు ఎడ్యుకేషన్: యునైటెడ్ యూత్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (యూవైడబ్ల్యూఓ) ఆధ్వర్యంలో ఈనెల 29న మోడల్ టెట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిన్నింటి బాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 2/11లోని కాంపిటీషన్ సక్సెస్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పేపర్-1, పేపర్-2 ద్వారా రాష్ట్రస్థాయిలో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మోడల్ టెట్‌కు హాజరయ్యేందుకు 9603669032 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

# రైతులపై ఎరువుల ధరవు

- ఎమ్మార్పీ కన్నా అధికంగా ఎరువుల విక్రయాలు
- ఒక్కో బస్తాపై రకాన్ని బట్టి రూ.50 నుంచి రూ.100 వరకూ వసూళ్లు
- వ్యవసాయ శాఖ తనిఖీలు నిల్



ట్రాక్టర్‌లో ఎరువులను పొలాలకు తరలిస్తున్న రైతులు

ప్రత్తిపాడు: ఎరువుల వ్యాపారులు రైతులపై అ'ధన'పు భారం మోపుతున్నారు. ఎమ్మార్పీకి విక్రయించాల్సిన ఎరువులను నిర్భయంగా అధిక ధరలకు అమ్ముతున్నారు. రకాన్ని బట్టి ఒక్కో బస్తాపై రూ. 50 నుంచి రూ. 100 వరకూ అదనంగా వసూలు చేస్తూ కర్షకుడి జేబుకు కన్నం పెడుతున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పంటలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో పంటలను కాపాడుకోవాలంటే సస్యరక్షణ చర్యలు అవసరం. దీంతో ఎరువులకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకున్న ఫెర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు ఎరువుల ధరలు అమాంతంగా పెంచేశారు. ఇష్టారీతిన ఇష్టమొచ్చిన రేట్లకు ఎరువులను విక్రయిస్తున్నారు.

**ఒక్కో రకానికి ఒక్కో ధర..**

ప్రస్తుతం ఎరువుల ఆవశ్యకత అధికంగా ఉన్న రకాలను బట్టి వ్యాపారులు ఒక్కో రకంగా ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. యూరియా 50 కేజీల బస్తా ఎమ్మార్పీ రూ.265 కాగా, దుకాణాల్లో రూ. 325కు విక్రయిస్తున్నారు. 10-26-26 రకం ఎమ్మార్పీ రూ. 1470 కాగా, వ్యాపారులు 1500 నుంచి 1600 వరకూ వసూలు చేస్తున్నారు. అదేవిధంగా 14-35-14, 28-28, 20-20-13 డీఏపీ ఇలా అన్ని రకాల ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మన గ్రోమోర్ వంటి సెంటర్లలో కూడా ఎత్తుడు కూలీ, దించుడు కూలీ కింద ఒక్కో బస్తాపై అదనంగా రూ. 20 వసూలు చేస్తున్నారు.

**బిల్లులు మాత్రం ఎమ్మార్పీకే..**

ఇదిలా ఉంటే వ్యాపారులు అధిక ధరల విక్రయంలో తమ తెలివితేటలను ప్రదర్శిస్తున్నారు. ఎరువులు కొన్న రైతుకు బిల్లు మాత్రం ఎమ్మార్పీకే ఇస్తున్నారు. కానీ నగదు మాత్రం వారు నిర్దేశించిన మొత్తం తీసుకుంటున్నారు. ఇదంతా ముందుగా దర్జాగా రైతులకు చెప్పే ఇస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే స్టాక్ లేదని చెబుతుండటంతో రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎరువులను అధిక ధరలకు కొనుగోలు చేసుకుని వెళ్లి పంటలకు ప్రాణం పోస్తున్నారు.

**రైతు సేవ కేంద్రాల్లో స్టాక్ లేక..**

రైతులకు నాణ్యమైన ఎరువులని ఎమ్మార్పీకి అందించాల్సిన రైతు సేవ కేంద్రాల్లో స్టాక్ అందుబాటులో లేని పరిస్థితి ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు స్టాకు తెప్పించకపోవడంతో సేవా కేంద్రాలు స్టాక్ లేక వెలవెలబోతున్నాయి. దీంతో దిక్కులేని పరిస్థితుల్లో అధిక ధరలకు రైతులు ఎరువులు కొనుగోలు చేసుకోవలసిన దుర్గతి కూటమి ప్రభుత్వం రైతాంగానికి పట్టించింది.

**వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తాం..**

ఎరువులు, పురుగుమందుల వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహిస్తాం. అధిక ధరలకు ఎరువులు విక్రయించకుండా చర్యలు తీసుకుంటా. ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవు. ఆకస్మిక తనిఖీలు చేపడతాం.

కె. అరుణ కుమారి, వ్యవసాయాధికారి, ప్రత్తిపాడు

## సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం



యూనివర్సిటీలో పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

చేబ్రోలు: నాన్ లీనియర్ అనాలిసిస్‌తో ఆవిష్కరణలను, పరిశోధనలను వేగంగా తీసుకెళ్లటంతో పాటు ఖచ్చితత్వం కలిగించి, సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుందని ఇటలీలోని పాలిటెక్నికో డి టోరినోకు చెందిన డాక్టర్ శాంటో బెనర్జీ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నాన్-లీనియర్ అనాలిసిస్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ (ఐసీఎన్ఏఎస్‌సీ-2024)' అనే అంశంపై మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను హైబ్రిడ్ మోడ్‌లో (ఆన్‌లైన్ అండ్ ఆఫ్‌లైన్) గురువారం ప్రారంభమైంది. 'ఐసీఎన్ఏఎస్‌సీ-2024'కు సంబంధించిన ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఇటలీలోని పాలిటెక్నికో డి టోరినో డాక్టర్ శాంటో బెనర్జీ మాట్లాడుతూ నాన్ లీనియర్ విశ్లేషణ సాంకేతికత, ఇంజినీరింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉపయోగపడుతుందన్నారు. నాన్ లీనియర్ సిస్టమ్స్ వాస్తవ ప్రపంచ సమస్యలకు దగ్గరగా ఉంటాయన్నారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్రిప్టోగ్రఫీ, ఐవోటీ, డేటా సైన్స్ వంటి సబ్జెక్టుల మీద కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్ఐటీ దుర్గాపూర్ ప్రొఫెసర్ సమర్జిత్‌కర్ మాట్లాడుతూ సైంటిఫిక్ కంప్యూటింగ్‌ను ఉపయోగించడం వలన పెద్ద గణనలతో పాటు సంక్లిష్ట సిమ్యులేషన్లతో కఠినమైన ఇంజనీరింగ్ మరియు శాస్త్రీయ పరిశోధనలు వేగవంతం చేయవచ్చునన్నారు. ఐఐటీ ధన్‌బాద్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు పెంట్యాల, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుపతి రావు పాడి, టాంజానియాలోని యూనివర్సిటీ ఆఫ్ డొడోమా అధ్యాపకులు డాక్టర్ జీ.శ్రీనివాసరావు, అలహాబాద్‌లోని ఎమ్ఎన్ఎన్ఐటీ ప్రొఫెసర్ శివ్ దత్ కుమార్, ఐఎస్ఐ కోల్‌కత్త ప్రొఫెసర్ అరుప్ కుమార్‌దాస్, సిక్కిం మణిపాల్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ అసిత్ సాహ, విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో 500 మందికి పైగా అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొని, వారి పరిశోధనా పత్రాలను ప్రచురించారు.

## 'చలపతి'లో స్వచ్ఛతా హీ సేవ




కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూయువకేంద్రం అధికారులు, విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవ జరుగుతున్నాయని, స్వమూహిక భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమని గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారిణి కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల, నెహ్రూ యువకేంద్రం గుంటూరు, వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, సంయుక్తాధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ అక్టోబర్ 2వరకు జిల్లావ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమాలను స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత నినాదంతో నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ అపరిశుభ్రత ప్రాంతాలను ఎంచుకొని అక్కడ ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛతపై దృష్టి సారించి వారికి తగిన పరికరాలను అందించి పరిశుభ్రత పై దృష్టి సారించే విధంగా సంఘటితం చేయడం అవసరమన్నారు. కళాశాల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ తోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను చేపట్టి స్వభావ్ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత అని చాటి చెప్పడమే వర్సటైల్ ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం అని ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయయాదవ్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు, నినాదాలతో వ్యర్థాలను ఏరివేయటం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకాన్ని తగ్గించటంపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసులు, డాక్టర్ ఎ.బాలాజీ, ఆర్‌వీఏ ప్రసాద్ వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్, మురళీకృష్ణ, సురేష్, కృష్ణతేజ, ఉమేష్‌చంద్ర, శరత్, విజయ్, సంహిత కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా



కందిపప్పు ప్యాకెట్లతో అంగన్‌వాడీలు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు ఎట్టకేలకు కందిపప్పు సరఫరా అయింది. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మూడు నెలలుగా కందిపప్పు, సరఫరా చేయడం లేదని దీంతో చిన్నారులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారంటూ ఈ నెల 22వ తేదీన 'పసి నోటికి.. పప్పు లేని బువ్వ' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం నుంచి కందిపప్పు మండలాలకు చేరాయి. అక్కడినుంచి గత రెండు రోజులుగా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు ప్యాకెట్లు చేరుతున్నాయి. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ముగిసిన క్రీడా ఎంపికలు



ప్రత్తిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత వారం రోజులుగా జరుగుతున్న మండల, నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు బాల, బాలికలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ ఎంపికలు జరిగాయి. పాఠశాలల పీడీలు, పీఈటీల సమక్షంలో విద్యార్థులు పోటీల్లో అదరగొట్టారు. ఆయా క్రీడలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి జట్లును ఎంపిక చేశారు. పోటీలను వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి పరిశీలించారు. క్రీడాకారులతో మాట్లాడారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్



సమస్యలు తెలుసుకుంటున్న బలసాని

గుంటూరు రూరల్: నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారాల దిశగా కృషిచేస్తానని తెలిపారు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషిచేద్దామని చెప్పారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెస్తే శక్తివంచన లేకుండా పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు



కుళాయి నీటిని తాగి పరిశీలిస్తున్న కమిషనర్

పొన్నూరు: పట్టణంలో తాగునీటి సరఫరాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ముంపునకు గురైన పదో వార్డులోని ఎస్టీ కాలనీని సందర్శించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లే దారిలేదని, మురుగునీటిలోనే జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు. కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుందని ఆయన దృష్టికి తెచ్చారు. కుళాయిల్లో వచ్చిన నీటిని కమిషనర్ తాగి పరిశీలించారు. కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. డ్రెయిన్లను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారులను హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆర్‌వీఆర్'లో అంతర్జాతీయ శాంతి దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: శాంతి సంస్కృతిని, ప్రతిఒక్కరి మనస్సులో నింపుకొన్నపుడే జీవితం ప్రశాంతంగా కొనసాగుతుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌడవరంలోని కళాశాలలో విద్యార్థులకు శాంతియుత మార్గం అనే అంశంపై ప్రసంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. సర్వత్రా శాంతియుత భావనలను బలోపేతం చేయడానికి అన్ని దేశాల ప్రతినిధులు అనేక కార్యక్రమాల ద్వారా శాంతి చర్చలు, ఇతర పరస్పర ఒప్పందాలతో తమ ఐకమత్యాన్ని చాటుతున్నాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను శాంతియుతంగా ఆలోచనలు చేసినప్పుడే మంచి పరిష్కార మార్గాలు దొరుకుతాయని, ప్రతి సంఘటనకి సంయమనం పాటిస్తే విజయం చేరువవుతుందని డాక్టర్ కె.శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కోడ్ ఆఫ్ కండక్ట్, ఎథిక్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎస్.రేణుక తదితరులు పాల్గొన్నారు.

## వీవీఐటీలో స్వర్ణాంధ్ర-2047 అభిప్రాయ సేకరణ



వాల్‌పోస్టర్‌లు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెదకాకాని: వికసిత భారత్-2047లో భాగంగా దేశప్రగతి, అభ్యున్నతిలో తెలుగు జాతి ముందుండాలి, రాష్ట్రం అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047' విజన్ ప్రణాళికాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం వీవీఐటీ కళాశాలలో నిర్వహించారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 2047 విజన్ సాకారం కావాలంటే వ్యూహాత్మక దృష్టి అవసరమన్నారు. విద్య, నైపుణ్యాల అంశంపై ఈనెల 27 నుంచి 29 వరకూ కళాశాలలో పలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లా ప్రణాళికా విభాగం స్టాటిస్టికల్ అధికారి కె.పోలయ్య కళాశాలలో స్వర్ణాంధ్ర 2047 అభిప్రాయ సేకరణ కరపత్రాలను విడుదల చేసి, ప్రణాళిక గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ సూచనలు అభిప్రాయాలు తెలియజేసి స్వర్ణాంధ్ర 2047లో భాగంకావాలన్నారు. వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన విద్యార్థులు తమ సూచనలు అభిప్రాయాలను అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, గుంటూరు ప్లానింగ్ డిప్యూటీ ఎస్ఓ శ్రీనివాసరావు, పెదకాకాని రెవెన్యూ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ అధికారి భక్తసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

చేబ్రోలు: ప్రజలందరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని చేబ్రోలు ఎంపీడీఓ కె.లలిత అన్నారు. చేబ్రోలు గ్రామ సచివాలయం వద్ద గురువారం సంక్షోభంలోను సంక్షేమం, అభివృద్ధికి రెక్కలు. ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 కోసం ఏపీ విజన్ పై గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, ఈవోపీఆర్డీ కె లలిత, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి జి శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉద్యాన హీనం!

- ఆదరణ కరువైన మున్సిపల్ మెమోరియల్ పార్క్
- పిచ్చి మొక్కలతో అధ్వానంగా పార్కు ప్రాంగణం
- వినియోగానికి నోచుకోక శిథిలావస్థకు చేరిన టాయిలెట్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కూర్చునే ప్రదేశం పిచ్చి మొక్కలతో నిండిన వైనం.. విరిగిపోయిన గొడుగులు, పాడైన బల్లలు

పొన్నూరు: నిడుబ్రోలులోని విశాలమైన చిట్టినేని వెంకట్రావు పార్కును మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఈ ఉద్యానవనం పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో ఈ ప్రాంతవాసులు నామమాత్రంగానే వినియోగిస్తున్నారు. పాములు, క్రిమి కీటకాలు సంచరిస్తున్నాయన్న భయంతో వృద్ధులు, మహిళలు ఇటురావడమే మానేశారు. ఆటలాడేందుకు ఆశపడుతున్న పిల్లలకు నిరాశే మిగులుతోంది. పార్కు ప్రాంగణం, ఓపెన్ జిమ్ ప్రదేశంలో టైల్స్ పాడై అధ్వానంగా ఉండటంతో పిల్లలు, పెద్దలకు ఇబ్బందికరంగా మారింది. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో నిరుపయోగంగా మారిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**2022లో ఆధునిక హంగులు..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2022 మార్చిలో నిరుపయోగంగా ఉన్న పెద్దన్న చెరువును సుమారు. రూ.98 లక్షలతో ఆధునిక హంగులతో అభివృద్ధి చేసి చిట్టినేని వెంకట్రావు మెమోరియల్ మున్సిపల్ పార్కుగా మార్చారు. పార్కు ప్రారంభంలో పచ్చదనంతో శోభిల్లింది. టైల్స్, అందమైన మొక్కలు, ఓపెన్ జిమ్, ఆట వస్తువులు, కూర్చునే బల్లలు ఏర్పాటు చేయడంతో రోజూ ఉదయం సాయంత్రం సందర్శకుల తాకిడి బాగానే ఉండేది. ఆదివారం, సెలవు రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉండేది. ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ ట్రాక్‌ను కూడా పట్టణ ప్రజలు వినియోగించేవారు.

**అధికారుల నిర్లక్ష్యంతో మూలన...**

కాలక్రమేణా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం మానేశారు. నూతన ప్రభుత్వం రాకతో శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. పిచ్చి మొక్కలు పెరిగి ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. ఓపెన్ జిమ్, పార్కు ప్రాంగణం అధ్వానంగా మారింది. టైల్స్ పగిలి పోవడంతో అందరికి ఇబ్బందికరంగా మారింది. టాయ్‌లెట్స్‌లో నీరు లేక వినియోగానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




టైల్స్ పాడై అధ్వానంగా ఉన్న ఓపెన్ జిమ్



శిథిలావస్థకు చేరిన టాయిలెట్

### దోపిడీదారులను జనసేనలో చేర్చుకోవడం సబబేనా!

మాదిగ మహాజన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వంటికుంట రాజేష్



పెదకాకాని: నీచమైన రాజకీయ నాయకులను ప్రశ్నిస్తాం దోచుకున్నది కక్కిస్తాం అనే కూటమి భాగస్వామి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ జనసేన పార్టీలోకి స్వార్థపరులను.. దోపిడీదారులను ఆహ్వానించడం ఎంతవరకు సమంజసం అని మాదిగ మహాజన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వరికుంట రాజేష్ అన్నారు. పెదకాకానిలో గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన ద్వారా రాజేష్ జీరో పాలిటిక్స్, క్లీన్ అండ్ గ్రీన్‌గా ప్రజా నాయకులను తయారు చేస్తామని ఉప ముఖ్యమంత్రి, అనేక అవినీతి ఆరోపణలు ఉన్న కిలారి వెంకటరోశయ్యను పార్టీలోకి చేర్చుకోవడం చూస్తే మీ నిలకడ లేని రాజకీయాల మీద ప్రజలకు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. రూ.వందల కోట్లు సంపాదించినట్లు పత్రికల్లో, టీవీల్లో వచ్చినప్పటికీ పార్టీలోకి ఆహ్వానించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, హిందూ ధర్మం కాపాడటం కోసం పోరాటాలు చేసే డిప్యూటీ సీఎం అక్రమ కేసులు పెట్టించడంతో పాటు బలవంతంగా వారే ఆత్మహత్య చేసుకునేలా ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని పార్టీలోకి చేర్చుకోవడం దురదృష్టకరమని వంటికుంట రాజేష్ ఆరోపించారు.